# కళాభాయి

'చెన్నపురి దక్షిణ మహారాష్ట్ర ఇనుపదారిలో' అది ఒక గొప్ప 'కూడలి'

బెజవాడ రైల్వేస్టేషన్. రకరకాల ప్రకృతులు - కొత్త కొత్త మనుష్యులు - వింతవింత యాసలు. అవి అందాలు కావు. అవి 'ఫేషన్లు' కావు. భూలోక స్వర్గం - స్వర్గలోకపు నరకం -

పగలు పది గంటలవేళ - చెన్నపురి నుంచి వాల్తేరు 'పాసింజరు' వచ్చే 'టైము' ఇంకా మొదటిగంట కొట్టలేదు.

ఒక జట్కా వచ్చి 'ఓవర్ బ్రిడ్జి' దగ్గర ఉన్న నిద్రగన్నేరు చెట్టుకింద ఆగింది. టాగోరు బురఖా - మాష్టరు విఠల్ క్రాపు - అదోరకమైన చూపుతోను బండిలోంచి వెడలెను సిగరెట్టుపాణి ఒకాయన - బండి బాడుగ ఒక అందంతో పారేసి, రంగు ఖద్దరు గుడ్డ కప్పిన తోలుపెట్టె, కూలీని పట్టుకోమని వంతెన మెట్లు ఎక్కాడు.

2

ప్రయాణీకులు రైలుకోసం నిరీక్షిస్తున్నారు. మునిసిపల్ చెత్త, బండెడు పుస్తకాలతో పుస్తకాలబ్బీ - 'లక్కా' సామాన్ల మనిషీ, కాఫీ అయ్యరూ బళ్ళు తోసుకుని రైల్వేయాసతో అరుస్తూ తిరుగుతున్నారు. పసిబిడ్డల ఏడ్పూ - పడుచువారి ఒయ్యారాలూ, దేశభక్తుల రీవీ, ఇన్స్యూరెన్సు ఏజంట్ల నిరంతర వాగుడూ స్టేషనంతా నిండి వుండగా ఆయన వచ్చి నిరీక్షణ గృహంవైపు వెళ్లి అక్కడ ఖాళీ లేకపోగా ఇవతల బెంచి దగ్గర పెట్టె పెట్టించి కూర్చున్నాడు. వేసంకాలం. చాలా ఉక్కగా వుంది. జేబు రుమాలు తీసి తుడుచుకుంటూ

రెట్టింపు శ్రమతో 'అబ్బా' ప్రపంచం అంతా ఎంత వేదనామయంగా వుందీ' అన్నాడు. తనకు చెమట పట్టినందుకో, పక్క బిచ్చగత్తె దీనాలాపాలకో!

సూట్‌కేస్ తెరచి ఆంగ్ల అందగత్తెల జపాను విసనకర్ర తీసి విసరుకుని జేబులోని అందమైన దువ్వెన తీసి క్రాపు దువ్వి మొహం ప్రసాధిస్తూ పైకి చూసి నమస్కారం అందుకుంటూ "ఓహో! నంద నందన్ గారా? నమస్కారం" అన్నాడు సవిలాసంగా. నంద నందన్‌గారు దేశభక్తుల కాంగ్రెసు చిరునవ్వుతో "ఆంధ్రదేశపు హిందీ ప్రచారం గురించి అలహాబాద్ నాయకులతో కొన్ని సంప్రతింపులకోసం వెడుతున్నానండి. ఆంధ్రులంతా హిందీ నేర్చుకోవడమే కాకుండా తద్దినాది కర్మకాండ అంతా హిందీలో జరిగితే మంచి ప్రచారం అవుతుందని మొన్నటి ఆంధ్రసభల్లో నేను ప్రతిపాదించగా అది ఏక గ్రీవంగా - ఏకహస్తంగా నెగ్గిపోయిందండి కొందరు ఆంధ్ర దురభిమానులు కాదని గోలించినా. హిందీకంటె దేశమోక్షం యేముందో చెప్పండి" అన్నాడు ఉపన్యాసోద్రేకం నెమ్మదిగా నిమ్మళించుకుంటూ.

"సందేహమేం - హిందీ దేశమోక్షానికే అందులోనూ, ఆంధ్రదేశ మోక్షానికే వచ్చింది. అయితే నన్ను మాత్రం ఠాకూరుబాబు కవితామృతం తాగెయ్యడానికి ముందు బంగాళీ నేర్చుకోనివ్వండి. మాకు దేశంకంటె కళ ముందు. కళారాధన జరిగిన తరవాత దేశభారం వహిస్తాం. విశ్వప్రవృత్తి అర్థం కావాలంటే విశ్వమానవ కల్యాణం సిద్ధించాలంటే - విశ్వభారతి గ్రంథాలు చదివితీరాలి, శాంతినికేతనం తొక్కితీరాలి. కాక తెలుగులో ఏముంది చెత్త."

"అంతే అంతే, తులసీదాసు రామాయణం ముందు తెనుగు భారత, భాగవత, రామాయణాలు దిగదుడుపులు గదండీ"

"అయితే - తిక్కన భారతం మాత్రం - మీరూ చదివారనుకుంటా"

"అబ్బే - లేదులెండి. తెనుగేమీ చదవను - సరే - మీరెంతవరకూ?"

"నేనీమధ్య ప్రకటించిన 'ఉషోరాణి' చూసి అనకాపల్లె ప్రజలు విముగ్ధులై నాకొక సన్మాన సభ ఏర్పరిచారు - ఊరికే లేనిపోని ఆడంబరాలు ఎందుకన్నా విన్నారు కారు"

"ఎంతమాట? మీవంటి కవిని సన్మానించడం ఆ ప్రజల అదృష్టం - కాస్త 'ఛా' పుచ్చుకుందాం రారూ"

"ఇప్పుడే కాఫీ అయింది మీరు వెళ్లండి"

నందనందన్ శిష్యబృందంతో టీకొట్టు వెంపు నడిచారు.

కళాభాయి, సిగరెటులు వెలిగించి ఆత్రంగా రెండు దమ్ములు లాగి,

"ప్రేమభారాన హృదయమ్ము ప్రిదిలినట్టి
పడుచు భావాల కొక మహాభాష్యమేను
'క్లాసికల్ టెంపర్‌మెంటు' కొట్టి లాక్కొచ్చాను. అనుకుని ఇంకో దమ్ము లాగి 'షెల్లీ' లా మొహంపెట్టి
గొంతుతీగలు పగిలి ప్రేమప్రకోప
బంధురము లైన ప్రణయభావాల రేప
పుడమి కెత్తిన పురిటినొప్పుల విధాన
వేయి కావ్యమ్ములే ప్రసవించివేయు.
అని కూనిరాగరంజితంగా చదువుతుండగా రైలుకు మొదటి గంట కొట్టారు.

## 3

ఒక చేతిలో థెర్మోఫ్లాస్కూ, తిత్తి తొడిగిన పాలజారీ రెండవ చేతిలో ఐదు నెలల పసిబిడ్డనూ ఎత్తుకుని రైలు దాటి పోతుందేమో అన్న తొందర మొహంమీద వ్రేలాడుతూండగా ఒక పదిహేనేళ్ల అమ్మాయి, ఆమె వెనక ఒక బట్టలమూటా, పాత సూటుకేసూ, కూజా, గొడుగూ ఈడ్చుకుంటూ తెస్తూన్న పాతికేండ్ల యువకుడూ వచ్చి ప్లాట్‌ఫారానికి దగ్గరగా కూర్చున్నారు. మొహాలు చికాకుగా వున్నాయి. పసిబిడ్డ ఎందుకో ఏడుస్తోంది. తల్లి అయిన ఆ అమ్మాయి, బిడ్డను సముదాయించలేక పాలతిత్తి బిడ్డగొంతులో కుక్కి, భర్తతో –

"ఇప్పుడెక్కడికి వెళ్లడం?"

"గోదారిలోకి"

"అట్లా విసిగిపోయి దిగులుపడితే ఎట్లా చెప్పండి ఏదో ఇంకోదారి చూడాలిగాని"

"ఆ దారికంటె ఏమీ కనిపించదు. ఆరునెల్లు కౌన్సిలర్సు అరుగుల మీద పడి దొర్లి సంపాదించిన మూడునెల్ల ఉద్యోగం అయిపోయింది. కాఫీ హోటల్లో పద్దులు వ్రాస్తాను పది రూపాయలిమ్మంటే ఇదివరకే ఒక బి.ఎ.ఎల్.టి. ఉన్నాడు పొమ్మన్నారు. ఏం చెయ్యమన్నావు"

"స్టేషన్‌లో వచ్చి పడ్డాం – కానీండి చూద్దాం, తునికి రెండు టిక్కట్లు కొనండి"

"అత్తవారి మీద – ఆధార...పడడం ఆత్మహత్య సీతా!"

"ఏం చేస్తాం? కొన్నాళ్లు అజ్ఞాతవాసం – రైలు వచ్చేస్తోంది లెండి చప్పున"

ఎట్లాగో సమాధానపడి సుబ్బారావు టికెట్ల కిటికీవెంపు వెళ్లాడు.

సీత పైటచెంగుతో మొహం తుడుచుకుని ఎదట కనిపించే బెజవాడ చిక్కుచిక్కు అయోమార్గంవలె అయోమయంగా వున్న తమ భవిష్యత్తు గురించి తన జాలికళ్లతో ఆలో

ర్చి

చిస్తూ శూన్యంగా ఒకసారి కళాభాయివైపు చూసి తల దించుకొన్నది. కళాభాయి నిదా నించి ఆమెను చూసి తన జపాను నోటుబుక్కు తీసి-

ప్రేయసీ యేల చూచెద విట్లు నన్ను
పదరిధవిల్లిన నా ప్రేమబాధ తెలిసి
హిమము దొరలిన మల్లికా సుమము రీతి
వలచికొమ్ము, మలచికొమ్ము, విలిచికొమ్ము
నా వలపుతో నిన్ను
నాశనము గావించి
ఉరిపోసుకొని చత్తునా - ప్రేయసీ
మరి కౌగిలికి వత్తువా?

అని వ్రాస్తున్నాడు.

సుబ్బారావు తొందరగా టిక్కెట్లు తెచ్చి "సీతా! రైలు వచ్చేసింది. పిల్లను తీసుకో అన్నాడు" సామాను సర్దుతూ. సీత మెల్లగా భర్తతో "ఎవరండీ ఆయన ఏదో మతిపోయి నట్టు నావైపు చూస్తూ రాస్తున్నాడు" అంది.

"చచ్చాం - భావకవి కాబోలేవ్, వీధిలో పడిపోతాం లే, లే' అన్నాడు వికారంగా. రైలు వచ్చేసింది.

గబగబ ప్రయాణీకుల్లో కలిసిపోయి ఆ దంపతులిద్దరూ ఏదో పెట్టెలో ఎక్కిపోయారు.

కళాభాయి పెట్టెను కూలీకిచ్చి ఖద్దరు బురఖా నలగకుండా, దువ్విన క్రాపు చెదర కుండా 'పోజు' మార్చి 'పోజు' ఇస్తూ రైలు దగ్గరకు వచ్చాడు.

సీత యెక్కిన పెట్టెకోసం ఎంత వెదకినా దొరక్కపోవడం చేత, రైలు కూతతో ఇంకో పెట్టెలో ఎక్కక తప్పింది కాదు.

## 4

రైలు పొగలు కక్కుకుంటూ పరుగెత్తుతున్నది. 'ముస్తాబాద'లో ఎక్కిన కుంటి బిచ్చ గాడు "పొయ్యేటప్పుడూ వెంటరాదు వక పుచ్చి వక్కయైనా, తండ్రీ ఒక్క డబ్బు నాయనా కాళ్ళు లేవు - దిక్కులేని పచ్చిని" అని రెండు చేతులు చాపుకొని కళాభాయి దగ్గరకు వచ్చేసరికి 'పోపో వెధవ గుడ్డలకంపు - అలా పైకి ఏడువు' అన్నాడు అసహ్యంగా. పక్క ఉద్యోగి 'పర్సు' తీసి డబ్బు ఇవ్వగా పైకి పోయాడు. కళాభాయి సిగరెట్టు వెలిగించి పక్క ఉద్యోగికి 'ఆఫర్' చేస్తూ

"ఎక్కడినుంచి వస్తున్నారండి"

కథా నిలయం
6070
శ్రీకాకుళం


"వద్దు – అభ్యాసం లేదు– అనంతపురం నుంచి వస్తున్నాను"

"అక్కడి క్షామం ఎలా వుందండి? – ఏనాడు మనకు తొల్లిటి ఔన్నత్యం వొస్తుందో కాని ప్రస్తుతం ప్రజలు – నిరుద్యోగ సమస్యలతో – గర్భదారిద్ర్యంతో తహతహలాడి పోతున్నారు. అటు – బీహారు – ఇటు క్వెట్టా – దైవోపహతం అయిపోయాయి గదా; నేనిక్కడ రాష్ట్రీయ హరిజన కమిటీ కార్యదర్శిని, నేను నాలుగు వందల రూపాయలు పోగుచేసి పైరెండింటికీ పంపాను. చూడలేదండీ నా పేరు ఆంధ్ర, హిందూలలో!

ఉద్యోగి పరధ్యానంగా చూస్తూ

"ఔ...ను – మీరు కొత్తకవిత్వం చెబుతారా?"

"ఉషోరాణి – 'మొగలిడొంక' అని రెండు కావ్యాలు ప్రకటితములై వేనోళ్ల ప్రశంసింప బడ్డాయి – నా పద్యాలు నేనే చదవాలని చాలామంది మా పెద్దలు అనడంచేత నేనేశ్రమ అనక ప్రతిచోటికి వెళ్లి చదువుతూంటాను. ఇంకా ఖండ కావ్యాలు అప్రకటితములు వున్నాయి – 'ఆమె' అనే కావ్యం ఒకటి కొత్తగా వ్రాస్తున్నాను"

"అనగా ఖండఖండా లంటే – రాసి చింపెయ్యడ మెందుకండీ"

"అబ్బే కాదండి – మా కొత్త పద్యాలని ఖండకావ్యం అంటాం. అట్లా అనమని మా గురువాజ్ఞ"

ఉద్యోగి, వీరంతా ఒక మఠంలో బైరాగి శిష్యులే కాబోలు అనుకొని

"అయితే 'ఆమె' అనే పుస్తకంలో ఇతివృత్తం యేమిటండీ!"

"మీరు మా ఖండకావ్యాలు చదవలేదన్నమాట – నేనొకామెను ప్రేమించి మా ప్రణయ ప్రవృత్తి అంతా ఒక అనుభవముద్రలో వెలువరించిన కావ్యం అది"

"ముద్ర లేమిటి? ఆమె మీద ఇంత కావ్యం వ్రాయడానికి మీకున్న హక్కేమిటి?"

"ఆమె నన్ను ప్రేమించింది – అదే హక్కు"

"మీది పొరపాటేమో అని ఆలోచించారా? మనం ప్రేమ విషయంలో నూటికి నూరుపాళ్ళు గుడ్డిగా వున్నాం. ఇట్లా నచ్చిన స్త్రీమీదల్లా కావ్యాలు రాస్తూ వుంటే కొన్నాళ్లకి మన వాఙ్మయం అంతా వలపు కవిత్వంతో నిండిపోయి మన పెద్దలు కాంక్షించిన విశ్వశ్రేయస్త్వం ఎగిరిపోతుంది కదండీ"

"ఒక అనుభవం కవిని ఊపుతుంది – దానినుండి కావ్యం వస్తుంది. కళకోసమే కళ. నీతి నియమం లేదు దానికి"

"పూర్వ కవులు అన్ని ఊగులూ ఊగి 'ఆగి' పాత్రల చాటు తమ అనుభవాలు, మనోహరంగా చెప్పేవారు. 'మీ డైరెక్టు మెథడు' వల్ల ప్రమాదాలు కూడా వున్నాయి. ఎందుకు

లెండి లేనిపోని విమర్శ - ఇదో యెగ-ఏదీ 'ఆమె'లోది ఒక పద్యం చదవండి."

పిఠాపురం స్టేషను. ఒంటిని గుడ్డపీలికలతో మాత్రమే కప్పుకున్న ఒక బిచ్చగత్తె ఈ పెట్టెలో ఎక్కి పీలికలు సర్దుకుంటూ

"ఏలరా రావణా ఇంత కావరా మేల?

పతివ్రతను చెరబెట్టి బతుకూతా వటరోరి

ఒక్క తండ్రికీ కనికారం గలగలా - ఏదరమ పెబువు గరబం కరగదా - ఒక్క రాగి డబ్బు తమ ఉమ్మేసే తాంబోలం పాటికాదు, మొగుడులేడు, బిడ్డల్లేరు, ఎండుకొమ్మనండి బాబయ్యా!"

కళాభాయి "ఏం ముష్టివెధవలండీ? చంపేస్తున్నారు. దేశాంతరాల్లో ఎవరినీ ముష్టెత్తుకోనివ్వరు. మనదేశానికే వచ్చింది ఈ విడ్డూరం అంతా. పెద్దమనిషితో మాటాడుతూంటే ఇప్పుడే ఏడవాలీ ఆ స్వీయచరిత్ర అంతా, అలా వెళ్లి మళ్ళీరా, చిల్లర లేదు"

ఉద్యోగి చిరునవ్వుతో "ఇంత దరిద్రం ఇంకే దేశంలోనూ లేదు కదండీ? ఇంకా రావలసినంతమంది బిచ్చానికి రావడమే లేదు, కొంపల్లో అన్నంలేక మగ్గిపోతూ ఉన్నా- ఏ, అమ్మీ! ఇంద" అని ఒక డబ్బు ఇచ్చి 'ఆమె'లోది ఒక్క పద్యం చదవరూ? అన్నాడు.

"ఈ ముష్టిపీనుగుల మధ్య ఏం పద్యాలు! ఏం కవిత్వం?"

"ఆ దరిద్రనారాయణుల దీనావస్థమీదే చెప్పండి - అందమయిన ఆడంగుల మోహాలు చూస్తేగాని కవిత్వం రాదాండి? ఇంతకీ పద్యం చదివారు కారు"

"ప్రేయసీ - - -

హిమము - - -"

"అయ్యా, మల్లెపువ్వుకీ ప్రేయసికీ ఉపమానోపమేయాలు బొత్తిగా కుదరక - నా బుద్ధికి సుమండి - పద్యం చాలా అయోమయంగా ఉంది"

"అంత 'సైంటిఫిక్కు'గా చూడడానికిది పురాణం కాదండి"

"ఆగ దనండి - పోనీ విమర్శ ఎందుకూ? తెలిస్తే ఆనందిస్తా లేకపోతే లేదు. మొగలి 'డొంక'లోది ఒక పద్యం చదవండి - "

"అందమయిన గడ్డిపూలు

అరవిరిసి తీయవలపు

సుషమ మంచు జడుల బొరలి

సుషమ సుఖజ్వాలలతో

చురచుర మనె నా యెడంద"

ఉద్యోగి తెల్లబోయి - నీరయిపోయి కొంతసేపటికి తేరుకుని "అయ్యా, నన్ను మన్నించి దీని తాత్పర్యం కాస్త సెలవియ్యాలి" అన్నాడు.

కళాభాయికి ఒళ్ళు మండిపోయింది. "ఎవడోయ్ వీడు ఎక్కడో జనమేజయం ముండాకొడుకు దాపురించాడు?" అనుకున్నాడు. తుని స్టేషన్. బండి కవతలినుండి ఎక్కిన గుడ్డి బిచ్చగాడు "కనుగొంటి వైదేహిని" అని పాడుతూ డబ్బులకు తడువుతున్నాడు. కళాభాయికి రవులుకుపోయి "చూశాడు ఈ గుడ్డికుంక వైదేహిని ఈ దరిద్రపుగొట్టు దేశంలో; ఈ అర్థతాత్పర్యంగాళ్ల మధ్య కళ ఏమిటీ? - కవిత్వం ఏమిటీ? అంటూ పెట్టెతో స్టేషన్‌లో దిగిపోయాడు. అక్కడ దిగే సీతను మరొక్కసారి చూసి ఇంకో పెట్టెలో ఎక్కుతాడు కాబోలు.

**(1935 అక్టోబరు - ప్రబుద్ధాంధ్ర)**